# అయ్యప్పకుట్టి ప్రేమకథ



కంఠంనేని రాధాకృష్ణమూర్తి

"ప్లెటానిక్ ప్రేమమీద నీ అభిప్రాయమేమిటి?"

మా ఇంటి వరండాలో కూర్చుని ఉన్నాము నేనూ, నాయరూ, శ్రీపతీ. బయట జోరున వర్షం కురుస్తోంది. ఆ చినుకుల దారాల్లోంచి దూరాన నది, దాని కవతలగా దిబ్బమీద మైదానపు పచ్చదనమూ, ఇంకా దూరాన హిల్ టాప్సూ, అదంతా విచిత్రంగా కనిపిస్తూ కళ్ళకూ, మెదడుకూ చల్లదనాన్నీ, హాయినీ అందిస్తున్నాయి.

పైన ఆస్బెస్టాస్ రేకులమీద పడుతున్న వర్షపు చప్పుడు రిథమ్‌తో కూడుకుని విన్పిస్తోంది. సొంపుగా చెవుల్లోకి ప్రవేశిస్తున్న ఆ చప్పుడూ, వయ్యారంగా కళ్ళముందు వైబ్రేట్ అవుతూ కనిపిస్తున్న వర్షపాతపు దృశ్యమూ నా మనస్సులో ఆహ్లాదంతో కూడుకున్న ఏవేవో వింత అనుభూతుల్ని సృష్టించసాగాయి.

మేము ముగ్గురం ఒక డివిజనులోనే పనిచేస్తున్నాము. సెలవు దినాల్లోనూ ఖాళీ సమయాల్లోనూ ఒక చోటికి చేరి బాతాఖానీ వేస్తుంటాము.

"మాట్లాడరూ?" మళ్ళా అడిగాడు నాయరు.

"అట్లాంటి ప్రేమమీద నాకు పెద్దగా నమ్మకం లేదు మిత్రమా," సినికల్‌గా అన్నాడు శ్రీపతి. "సృష్టిలోని ప్రతి జీవి మనుగడా స్వార్థ సిద్ధాంతంమీద ఆధారపడుతూ స్వార్థబుద్ధితో మాత్రమే నడుస్తుంటుంది. మనుషుల్లోని ప్రేమ కూడా అట్లాంటిదేనని చెప్పుకోవాలి. ప్రేమ ఎప్పుడూ ప్లస్ పాయింట్లనే వాంఛిస్తుంది. అవతలి మనిషి కూడా తనను ప్రేమించాలనీ, తనకు లభించాలనీ కోరుకోవటమూ, అలా కుదరని నాడు ఆయా వ్యక్తుల మనస్తత్వాన్ని బట్టి అతను నిరాశాజీవిగానో లేక విలన్‌గా మారిపోవటం జరుగుతుంది. ఎంత లేదన్నా ప్రేమయొక్క— 'గోల్'—ఐమీన్ చరమ ఉద్దేశ్యం— 'ఫోర్ బటన్స్ ఆన్ ఎ స్టెమ్' అంతే. ఈ ప్లెటానిక్ ప్రేమ— అన్నది ఉత్త హంబగ్—కవుల్లూ, కథ

కులూ షైన్ అవటానికి పనికివస్తుంది తప్ప ”

నాయరుకు ఆ సమాధానం అంత సంతృప్తి కలిగించినట్లు లేదు. కొద్దిసేపు పరధ్యానంగా వర్షంలోకి చూస్తూ కూర్చున్నాడతను.

“నేనో ఉదాహరణ చెప్పనా ?” సడన్‌గా అన్నాడతను.

“ఏమిటది ?”

“నాకో మనిషి తెలుసు. జీవితాంతమూ అతనో స్త్రీని గాఢంగా ప్రేమించాడు, పెద్దగా ప్రతిఫలాపేక్ష లేకుండా. ఆమె తనకు లభ్యం కాకపోయినా, ఆమె చనిపోయాక కూడా అతనా ప్రేమను అలా కంటిన్యూ చేసుకుంటూ వచ్చాడు. దానికేమంటావు ?”

నవ్వాడు శ్రీపతి.

“ఆ కథేమిటో ముందు చెప్పి, తర్వాత నా అభిప్రాయ మడుగు !” అన్నాడు.

అప్పుడు నాయరు ఈ క్రింది కథలాంటి దాన్ని చెప్పుకొచ్చాడు.

నాయరు వాళ్ళ ఊళ్ళో - కేరళలోని ఒక కుగ్రామంలో-జరిగిందీ కథ:

అతని పేరు అయ్యప్పకుట్టి. నలభై ఎనిమిదేళ్లుంటాయి. నలుగురు పిల్లలు. స్కూల్లో మేష్టారుగా పనిచేస్తుంటాడు. జీవితంపట్ల పెద్దగా ఆసక్తి ఉన్నట్లుగా కనిపించడు. ఏదో ఈ లోకంలో పుట్టాము కాబట్టీ, పుట్టినందుకు బ్రతకాలి కాబట్టీ బ్రతుకుతున్నట్లుగా కనిపిస్తాడు. ప్రతి విషయంలోనూ నిర్లిప్తత ఎక్కువ. ఒక రకమైన ‘స్టొయిక్’గా చెప్పుకోవచ్చు అతణ్ణి. నెలజీతం రాగానే తీసుకువచ్చి భార్య చేతుల్లో పోస్తాడు. అంతే, ఆ జీతం సరిపోతోందో, ఏమైనా మిగుల్తోందో, ఇంటికి ఇంకా ఏమైనా అవసరాలున్నాయేమో, ఇట్లాంటి విషయాలేమి అతనికి పట్టవు. అంతా భార్యే చూసుకుంటుంది. అతనికి ఎవరిపట్లా పెద్దగా అనుబంధాలూ మమకారాలూ ఉన్నట్లుగా కూడా కనిపించదు, ఒక్క చిన్న కొడుకు-ఏడేళ్ళ రవి విషయంలో తప్ప. నలభై అయిదేళ్ల జీవితకాలం ఏనాడూ అతనికి మానసికంగా చెప్పుకో దగ్గ స్పందనను అందించలేదు. అంతా యాంత్రికం. దేశం ఎమైపోతోందో, చుట్టూ మనుషుల్లో సాంఘికంగానూ, సాంస్కృతికంగానూ, రాజకీయంగానూ ఎట్లాంటి పరిణామాలు జరిగిపోతున్నాయో, ఇట్లాంటి వాటిని పరిశీలించటానికి అతను ఏనాడూ ప్రయత్నించ లేదు. అదంతా అతనికి అనవసరం. అసలు అతని దృష్టిలో అవన్నీ వాస్తవాలే కావు, ఓ స్వప్నం-అంతే. అతనికున్న అభిరుచులల్లా రెండే రెండు - ఒకటి సాహిత్యమూ, రెండోది సాయంత్రాలు షికార్లు.

సాయంత్రం స్కూలునుంచి ఇంటికి రాగానే స్నానం చేస్తాడు. తర్వాత

కొడుకును వెంటబెట్టుకుని ఊరి బయటకు షికారుకు వెళ్తాడు. కేరళ అంటేనే ప్రకృతి సౌందర్యానికి పెట్టింది పేరు. నది వొడ్డున ఉంది వాళ్ళ ఊరు. వర్షా కాలంలో నదిలో నీళ్ల ఉరకలు పరుగులు మీద ప్రవహిస్తుంటుంది. అలలమీద ఉయ్యాల లూగుతూ సాగిపోయే పడవలు, చుట్టూ కొబ్బరిచెట్లు, పచ్చటి కొండలు, చక్కటి సూర్యాస్తమయాలు, కులుక్కుంటూ ఆకాశంలోకి చేరుకునే జాబిల్లి, ప్రేమతో లోకాన్ని కావిలించు కుంటూ విచ్చుకునే వెన్నెలా, చెట్లకింది నీడల్లో వెన్నెల పొరలు, మబ్బుల్లేని నల్లటి రాత్రులు, ఆకాశంలో అనంతంగా విరబూచే వెలుగు పుష్పాలు, చుట్టూ మిస్టీరియస్‌గా కిక్కిరిన చీకట్ల పొదలు, గాలికి కదిలే ఆకులు, అవి వెలువరించే గుసగుసలు, ఓహ్! భూలోకమా లేక స్వర్గమా

తిరిగి అతను ఇంటికి జేరుకునే సరికి బాగా ప్రొద్దుపోతుంది.

"ఇప్పటిదాకా ఏం చేస్తారు? మీకోసం చూసి చూసి ఇప్పుడే భోంచేసాను," అంటుందతని భార్య.

"నా కూడా వడ్డించు," అంటా డతను.

ఏనాడూ అతను భార్యను 'అన్నం పెట్టు' అని ఆజ్ఞాపూర్వకంగా అనడు, 'అన్నం పెడతావా' అనో 'వడ్డిస్తావా' అనో అడుగుతాడు తప్ప

అదీ అతని జీవన సరళి.

అట్లా మన్నుదిన్న పాములా మెల్లగా సాగుతున్న అతని జీవితంలోకి హటాత్తుగా ఒక పెద్ద కదలిక ప్రవేశిం చింది. ఆ కదలికకు మూలం మనోరమ!

ఓరోజు సాయంత్రం ఎప్పటిలాగే అతను కొడుకును తీసుకుని షికారుకు వెళ్తున్నాడు. చలికాలం అది. సూర్యాస్త మయ మవబోతోంది. అప్పటికే చలి ప్రారంభమయ్యింది. ఊరు దాటాడతను. పరధ్యానంగా నడుస్తున్న అతనికి సడన్‌గా తన ముందునుంచి ఏదో వెలుగు దాటిపోయినట్లుగా అనిపించింది. ఉలిక్కి పడ్డట్లుగా వెనక్కి తిరిగి చూసాడు. ఆరెంజి రంగు చీర, అదేరంగు జాకెట్ లు వొంటి రంగుతో జతపడుతుండగా వొకామె ఊళ్లోకి నడిచిపోతోంది. మధ్య రకం ఎత్తులో ఉందామె. తగ్గ సన్నదనం. ఆమె నడకలో తగని వయ్యారం ఉంది. పక్కనే ఆమె చెయ్యి పట్టుకుని ఓ అయిదేళ్ళ పిల్ల నడుస్తోంది. ఆ సమ యాన అయ్యప్పకుట్టిలో ఏ రకమైన భావాలూ కదలలేదనే చెప్పుకోవాలి. కాని ఏదో మంత్రంతో కట్టివేయబడ్డ వాడిలా లోకాన్ని మరిచిపోయి అట్లా ఆమెవేపు చూస్తూ నిల్చుండిపోయాడు.

"ఏమిటి నాన్నా చూస్తున్నావు?"

కొడుకు ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చాడతను.

"ఏమీ లేదు, పద పద!"

ఆ మర్నాడు కూడా ఆమె దాదాపు అదే ప్రదేశం వద్ద ఎదురుపడిం దతనికి. అయితే ఈసారి ఆమె తనను దాటిపోక ముందే గమనించాడు. పెద్ద పెద్ద వక్షోజాలు ఆమెవి. నాజూకు ముక్కు. వెడల్పాటి కళ్ళు. చెక్కినట్లున్న చెంపలు. పాలరాతి బొమ్మలా ఉందామె. దూరాన్నుంచి ఆమెవేపు కళ్ళప్పగించిన అయ్యప్పకుట్టి ఆమె దగ్గరకు రాగానే సభ్యతగా చూపును మరల్చుకున్నాడు.

ఆ తర్వాత ఆమె రోజూ అతనికి అట్లా తటస్థపడసాగింది. ఆమె వెంట ఆ అయిదేళ్ళ కూతురూ, ఇతని వెంట ఇతని ఏడేళ్ళ కొడుకూ.

కొన్నాళ్ళపాటు ఇద్దరూ అపరిచితంగానే ఉండిపోయారు.

ఒకరోజు ఆమె అడిగింది.

"మీది ఈ ఊరేనా?"

"అవునండీ!"

తనొక ఉపాధ్యాయుడనీ, తన వివరాలన్నీ చెప్పుకున్నాడతను.


"మరి మీరు?" అడిగాడు తను కూడా.

ఆమె ఆ ఊళ్ళోని ధనికుడైన ఒక నాయరుకు కోడలు. ఆ నాయరు రెండు దఫాలు ప్రజానాయకుడుగా ఎన్నికోబడటంతో గత పదేళ్ళనుంచీ దేశ రాజధానిలో ఉంటూ వచ్చాడు కుటుంబ పరివార సమేతంగా. యాడాది క్రితం ఎలక్షన్లలో ఓడిపోవటంతో మళ్ళా పరివారాన్నంతటినీ తీసుకుని స్వగ్రామానికి వచ్చేసాడు, ఈమె అతని పెద్ద కొడుకు భార్య. పేరు మనోరమ. మొన్నటిదాకా ఈమె కూడా భర్తతోపాటు రాజధానిలోనే ఉంటూ వచ్చింది. స్థిరాస్తులు చాలా భాగం వాళ్ళకు ఈ ఊళ్ళోనే ఉన్నాయి

ఆమె చాలా నెమ్మదిగా మాట్లాడుతుంది. మాట్లాడుతుంటే ఆమె స్వరం చాలా బలహీనంగా ఉండి, మాటలు గొంతులోంచి బయటికి రాగానే ఇవతలి వాళ్ల చెవుల్ని చేరుకోకుండానే మధ్యలో నేలమీద రాలిపోతాయేమో ననిపిస్తుంది. విచిత్రంగా ఉండేది అయ్యప్పకుట్టికి.

క్రమంగా ఇద్దరికీ ఒకే సమయాన షికారుకు బయల్దేరటం అలవాటయ్యింది. అలా నది వడ్డున నడుచుకుంటూ పోతూనో, లేక ఓ ప్రదేశాన కూర్చునో ఏవేవో మాట్లాడుకుంటారు. అవతలగా ఇద్దరు పిల్లలూ ఆడుకుంటుంటారు. సామాన్యంగా వాళ్ళిద్దరిమధ్యా సాహిత్యానికి సంబంధించిన సంభాషణలే ఎక్కువగా నడుస్తుండేవి. మరికొన్ని సమయాల్లో ఆమె తన గోడు వెళ్ళబోసుకునేది.

ఇన్నేళ్ల నుంచీ నగర జీవితానికి అలవాటుపడ్డ ఆమెకు ఇక్కడేమీ తోచటం లేదు. భర్త ఎక్కువ ఇంట్లో ఉండడు. వ్యాపార రీత్యా తిరుగుతుంటాడు. పగలల్లా ఆమె ఏ పేపరో, పుస్తకమో చదువుతూ కూర్చుంటుంది.




సాయంత్రం కాగానే కారాగారంలోంచి బయటపడ్డట్లుగా ఇట్లా షికారుకు వస్తుంది కూతుర్ని తీసుకుని. ఏదో కవిత్వమూ అదీ రాస్తుంటుందామె. ఆమె అభిరుచికి తగ్గ మనుష్యులెవరూ తటస్థ పడలేదిక్కడ

ఒకోసారి ఆమె తన కవిత్వాన్ని వినిపించేదతనికి. నిజానికి అతనికా కవిత్వం పెద్దగా నచ్చకపోయినా చాలా బాగుందని మెచ్చుకునేవాడు. అట్లా తనన్నప్పుడు ఆమె కళ్ళల్లో మెరిసే మెరుపుల్ని చూడటం అతనికి ఎంతో ఇష్టంగా ఉండేది. స్వతహా అతను ముక్తసరి స్వభావి. ఆ సంగతి అతనూ ఎరుగును. అట్లాంటి తను ఆమె ముందు అట్లా ఏకధాటిగా మాట్లాడుతుండటం అతనికే ఆశ్చర్యమనిపించేది. అంతేకాక అతనికి తన చిన్నకొడుకు రవి మీద అమితమైన ప్రేమ ఉంది. ఎవరైనా పిల్లలు తన రవిని కొడితేనో లేక పెద్దలెవరైనా-ఆఖరికి తన భార్య అయినా సరే-రవిని విసుక్కుంటేనో అతనికి చాలా కోపమొస్తుంది. అట్లాంటిది మనోరమ కూతురు రవి తనను కొట్టాడని కంప్లెయింట్ చేస్తేనో, అయా సమయాల్లో మనోరమే రవిని విసుక్కుంటేనో అతనికి వాళ్ళమీద కోపం కలగటం లేదు. పైగా తనే రవిమీద విసుక్కుంటున్నాడు కూడా. కొన్ని సమయాల్లో రవి తప్పేమీ లేదని తెలిసికూడా. ఏమిటి తనలో ఈ మార్పు? మనోరమ మెప్పుకోసం తాపత్రయపడుతున్నాడా తను? ఎందుకామె మెప్పు తనకు?? అర్థమయ్యేది కాదతనికి.

ఇట్లాంటి రోజుల్లోనే ఓ సాయంత్రం మనోరమ షికారుకు రాలేదు. ఆరోజు అయ్యప్పకుట్టి ఆమె కోసం తెగ ఎదురు చూసాడు. చీకటి పడుతున్నకొద్దీ అతనిలో ఆత్రం పెరిగింది,

ఇంకా ఎందుకు రాలేదామె?

రాదా ఇవాళ?

ఎందుకని??

"మనోరమ ఆంటీ ఇవాళ ఇంకా రాలేదేమిటి రవీ?" ఒకటి రెండుసార్లు కొడుకును అడిగాడు.

చెప్పరాని దిగులుతో ఇంటికి చేరుకున్నాడతనారోజు.

మర్నాడు అతను మరింత ముందుగా బయలుదేరి వెళ్ళాడు. మళ్ళీ అదే నిరీక్షణ. గుండెల్లో టెన్షనూ, దిగులూ-

అట్లా వారం రోజులు ఆమె రాలేదు. ఆ వారంరోజులూ అయ్యప్పకుట్టి విపరీతమైన వేదనను అనుభవించాడు. అది నిరీక్షణ-నిరాశ-దిగులు-మెలాంకొలీ -ఇంకా ఏమేమిటో మాటల్లోని చెప్పవీలుగాని గుండెల బరువు-

ఎనిమిదో రోజున ఆమెను అల్లంత దూరాన చూడగానే అతని గుండెల్లో పెద్ద సంతోష తరంగం ఒకటి అంత ఎత్తుకి ఎగసిపడింది.

"మనోరమగారూ, ఇన్నాళ్లూ మీరు ఎటు వెళ్ళారు?" ఆత్రంగా అడిగాడు.

"ఎర్నాకులం వెళ్ళాము."

"ఎందుకు వెళ్లారు? మీకోసం ఇక్కడ నేను నిరీక్షించలేక చచ్చాననుకోండి".

-అప్రయత్నంగా అన్నాడతను. అన్నాక నాలిక కరుచుకున్నాడు.

విచిత్రంగా చూసిందామె.

తర్వాత చిన్నగా నవ్వింది.

ఇంతలో వర్షాకాలం వచ్చింది. నదిలో ఉరకలమీద పరుగులు తీసే నీటి ప్రవాహం, పైన సముద్రం లాంటి ఆకాశంలో బరువుగా కదులుతుంటూ పోయే నల్లటి మబ్బు పడవలు, ఎటు చూచినా కళ్లకు మెత్తటి పచ్చదనం, ప్రకృతిపడుచు తలారా స్నానంచేసి నగ్నంగా కూర్చుని వొంటిని అరబెట్టుకుంటున్నట్లుగా ఉండే ఆ రోజుల్లో ఓ విచిత్ర సంఘటన జరిగింది. దాన్ని ఎంత విచిత్రమైనదిగా భావించవచ్చో అంతటి ఘోరమైనదిగా కూడా చెప్పుకోవచ్చు.

ఆరోజు అయ్యప్పకుట్టి, మనోరమలు నది వొడ్డున ఓచోట కూర్చుని మాట్లాడుకుంటున్నారు. నదిలో నీరు నిండుగా అలల్ని రేపుకుంటూ ఉధృతంగా ప్రవహిస్తోంది. వాళ్లకు కొద్ది ఎడంగా పిల్లలిద్దరూ అతని కొడుకూ, ఆమె కూతురూ ఒకరివెంట ఒకళ్లు పరుగులు పెడుతూ ఆటుకుంటున్నారు.

మనోరమ ఆరోజు తను రాసుకొచ్చిన కవిత్వాన్ని చదువుతోంది.

అయ్యప్పకుట్టి అప్లాజ్ చేస్తున్నాడు.

అకస్మాత్తుగా ఏదో అయింది, పిల్లలిద్దరూ భయంతో కేకలు పెట్టటం వినిపించింది వాళ్లకు.

లేచి చూసేసరికి పిల్లలు నదిలో కొట్టుకుపోతూ మునుగుతూ తేల్తూ అరుస్తుండటం కనిపించింది.

అయ్యప్పకుట్టి ప్రాణం ఒక్కసారిగా

యిల్లుమన్నది. తన రవి! తన ప్రాణం కంటే మిన్న అయిన రవి నీళ్ళలో కొట్టుకుపోతున్నాడు. మునుగుతూ తేల్తూ, నీళ్ళు మింగుతూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. ఒక్క ఉదుటున పరుగు దీసుకు వెళ్ళి అయ్యప్పకుట్టి వెనకా ముందూ చూడకండా నదిలోకి దూకాడు. అతనికి ఈత బాగానే వచ్చును. బారలు వేస్తూ వాళ్ళ వేపుకు సాగాడు. పిల్లలిద్దరూ ఒక దగ్గరలోనే ఉన్నారు. కొడుకుకు ఓ గజం దూరంలోకి వచ్చాక ఆ వేపుకు చేయి జాపబోతున్న అయ్యప్పకుట్టికి వడ్డుమీదనుంచి ఓ కేక వినిపించింది.

"అయ్యప్పా!"

మంత్రముగ్ధుడిలా ఆగిపోయాడు అయ్యప్పకుట్టి.

అది మనోరమ స్వరం!

"ముందు మా బేబీని తియ్యవూ?"

అందమైన ఆమె కళ్ళల్లో ఆందోళనా, భయం. కోమలమైన ఆ సౌందర్యరాసి తనను అర్థిస్తోంది, ఆజ్ఞాపిస్తోంది, వేడుకుంటోంది.

ఆ క్షణాన ఒక వికృతమైన నిర్ణయం తీసుకున్నాడు అయ్యప్పకుట్టి.

కొడుకువేపుకు చేయిజాచిన అతను చటుక్కున పక్కకు కదిలి మనోరమ కూతురువేపు బారలువేసాడు.

ఎంత దారుణమైన నిర్ణయం అది!

ఫలితంగా మనోరమ కూతురు బ్రతికి బట్టకట్టగలిగితే అయ్యప్పకుట్టి కొడుకు విగతజీవుడుగా బయటికి తీయబడ్డాడు.

ఆ క్షణాన అంతటి ఆందోళనలోనూ మనోరమ చాలా ఆశ్చర్యపోయింది.

ఆడిది బడాయిని తిని బ్రతుకుతుందంటారు. మనోరమ అందుకు మినహాయింపు కాదు. పై సంఘటన గురించి ఆమె ఇంట్లో బాగానే చెప్పుకుంది. ఇంట్లోవాళ్ళు మొదట సంతోషించారు. పిదప వినోదించారు. ఆ తర్వాత ఏదో ప్రమాదాన్ని శంకించారు. ఫలితంగా ఆమె మీద కొన్ని ఆంక్షలు విధించబడ్డాయి. అందులో మొదటిదీ ముఖ్యమైనదీ ఆమె ఇక అయ్యప్పకుట్టిని కలుసుకోవద్దని!

ఇక అయ్యప్పకుట్టి విషయానికొస్తే—కొడుకు మరణం అతణ్ణి చాన్నాళ్ళపాటు కృంగదీసింది. తనెంత దుర్మార్గుడు! కొడుకును చేతులారా చంపుకున్నాడు. రక్షించగలిగి ఉండే కళ్ళ ఎదురుగా చచ్చిపోతుంటే చూస్తూ ఊరుకున్నాడు. అతను మునగటమూ, తేలటమూ, నీళ్ళ మింగుతూ ఉక్కిరిబిక్కిరి కావటమూ, చేయిజాపి 'నాన్నా' అంటూ అరవటమూ, అతని దీనమైన చూపులూ రేత్రింబవళ్లూ కళ్ళ ముందు కన్పించి వేధించే వతణ్ణి.

అట్లా ఒక్క నెల రోజులు. అంతే. ఆ తర్వాత ఓ రాత్రి అనుకోకుండా మనోరమ కలలోకి వచ్చింది అతనికి. అప్పటివరకూ అతని మనస్సులో కొడుకు

అతిక్రమించిన స్థానంలోకి ఆమె ప్రవేశించింది. ఆ మర్నాడు సాయంత్రం మళ్ళీ నదిపేపుకు వెళ్ళాడు, అయ్యప్ప కుట్టి. కాని మనోరమ కనిపించలేదు. ఆ రాత్రి కూడా ఆమె అతనికి కలలో కనిపించింది. ఆమె తన కవిత్వం చదివి వినిపించుతోంది. అతని కళ్ళల్లోకి చూసి నవ్వుతోంది. పెదిమలు బిగించి విచిత్రంగా వింటోందతని మాటల్ని అట్లా రోజులు గడుస్తున్నాయి. ప్రతి రోజూ ఆమె అతని కలల్లోకి రావటమూ, వాస్తవంలో ఆమె కనిపించకపోవటమూ . నిరాశ, నిరాశ. అతనిలో వాంఛ రోజు రోజుకూ తీవ్రం కాసాగింది, ఆమెను కలుసుకోవాలనీ, మాట్లాడాలనీ. కాని ఆమె ఇంటికి వెళ్ళలేదతను. వాళ్ళ వాళ్ళతో అతనికి పెద్దగా పరిచయంలేదు. కాక స్థాయీభేదమూ ఉంది. ఇక ఎన్నాళ్ళో భరించలేకపోయాడతడు. ఆఖరికి భార్య ముందు ప్రస్తావించాడు.

"నీతో ఓ మాట మాట్లాడాలి," అన్నాడు.

"ఏమిటది ?" అడిగిందామె.

"మనోరమను చూడకుండా నేను బ్రతకలేననిపిస్తోంది.

ఆశ్చర్యంగా చూసిందామె.

"ఈ వయస్సులో మీరు మీకేదో పిచ్చి పట్టింది."

"అవును. నాకేదో పిచ్చేపట్టినట్లుంది," అతనన్నాడు. "కోరికలు లేకుండా, ఒక రకంగా నిర్వికారంగా బ్రతుకుతున్న నా జీవితంలోకి ఎట్లాగో ఆమె ప్రవేశించింది. ఇట్లా అంటున్నానంటే ఆమెతో నాకేదో సంబంధముందనికాదు.నా కసలా అర్హత కూడా లేదేమో.కాని_కాని_ రోజూ కొకసారైనా ఆమె కనపడందే_ ఆమె చిరునవ్వుని_ఆమె పెదవుల విన్యాసాన్ని పెద్ద పెద్ద కళ్ళల్లోంచి వెలువడే ఆ సమ్మోహ కిరణాల్ని_ చూడందే నేను బ్రతకలేననిపిస్తోంది. నన్ను నేను నిగ్రహించుకోవాలని చేసే నా ప్రయత్నాలన్నీ వమ్మయిపోతున్నాయి. నా అసమర్థతకి నాకే సిగ్గేస్తోంది. కాని_కాని.. "

భార్య మొహంలోకి చూడలేక మొహాన్ని చేతుల్లో దాచుకున్నాడతను.


ఆమె మొహం పాలిపోయింది.

"ఛీ ఛీ, భార్య ముందు మరో ఆడదాన్ని చూడందే బ్రతకలేనని చెప్పటానికి మీకు సిగ్గువేయటంలా ?" అన్నది ఉక్రోషంగా

చటుక్కున అతను ఆమె కాళ్ళ ముందు కూలబడిపోయాడు. ఆమె మోకాళ్ళను వాటేసుకున్నాడు.

"నువ్వు ఎన్నైనా అను, నీకాళ్ళతో నన్ను తన్ను, నా మొహంమీద ఉమ్మేయి, కాని, కాని, దయచేసి నాకీ ఒక్క సహాయాన్ని చేసిపెట్టు. ఆమెను నేనొక్కసారి కలుసుకునే ఏర్పాటు చెయ్యి ."

అన్నేళ్ళనుంచీ హుందాగా బ్రతికిన




భర్త అట్లా కాళ్ళుపట్టుకుని అడిగేసరికి ఆమె నీరుగారిపోయింది. మనస్సులో ఆమెకు దేవినిట్లుగా అనిపించింది. అంతకు ముందే ఆమె కర్ణాకర్ణిగా విని ఉంది, తన కొడుకు మరణానికి భర్తే కారణమని. మనోరమ పట్ల భర్త మోహమే కారణమనీ. అప్పట్లో ఆమె నమ్మలేదు. కాని ఇప్పుడు భర్త మనోస్థితి అవగతమయ్యేసరికి ఒక్కసారిగా వణికిపోయింది. అయినా ఆమెలో స్త్రీ సహజమైన దాక్షిణ్యం పని చేసింది

"స్వంత భార్య అయిఉండీ మరీ రాయబారాన్ని ఎట్లా తెచ్చారో నాకర్థం కావటం లేదు," అన్నద మనోరమ ఆమెతో.

తలవంచుకుంది అయ్యప్పకుట్టి భార్య.

"అవునమ్మా!" ఆమె అన్నది. "ఇది ఎట్లాంటి నీచమైన పనో నాకూ తెలుసు. నా దౌర్భాగ్యస్థితికి నాకే సిగ్గేస్తోంది. నా భర్త- నా భర్త- నా కాళ్లు పట్టుకుని మరీ బ్రతిమాలాడాడు నన్ను. దాన్ని బట్టి ఆలోచించండి ఆయన ఎంత దిగజారిపోయాడో. మిమల్ని పతనమవ్వమని నేను అర్థించటం లేదు. ఒక్కసారి ఆయనతో మాట్లాడండి చాలు. రాత్రింబవళ్ళూ ఆయన స్థితిని చూడలేకుండా ఉన్నాను. ఇదేదన్నా దేహసంబంధమైన వ్యాధి అయితే ఏ డాక్టరుకో చూపించవచ్చు. కాని, కాని ఆయన ఏనాడో ఆత్మహత్య చేసుకుంటాడేమోనని నాకు భయమేస్తోందమ్మా"

అయ్యప్పకుట్టిని ఒక్కసారి కలుసుకోవటానికి వప్పుకుంది మనోరమ.

ఇంట్లో ఎవరూలేని సమయాన కబురు చేసిందామె అతని కోసం.

వెళ్ళాడు అయ్యప్పకుట్టి. కాని

సూటిగా ఆమె మొహంలోకి చూడలేక పోయాడు. నేరస్తుడిలా ఆమె ముందు నిలబడి ఆమె పాదాలవేపు చూడ సాగాడు.

ఆమె కుర్చీలో కూర్చుని ఉంది.

"నిలబడే ఉన్నారు, కూర్చోండి," మరో కుర్చునీ చూపిస్తూ అన్నది.

కాని అతను కూర్చోలేదు.

చాలాసేపు ఆమె పాదాలవేపు చూస్తూ ఉండిపోయి సడన్‌గా పాఠం వొప్పజెప్పు తున్న వాడిలా గబగబా ఇలా అన్నాడు.

"మనోరమా, మనోరమా! మీతో నేను వయసులో గానీ, అందంలో గానీ ఎందులోనూ తూగలేను. ఆ సంగతి నాకా తెలుసు. కాని ఒక్కసారి— మీ పాదాల్ని ముద్దుపెట్టుకోనివ్వండి నన్ను— అందుకు నేను అనర్హుణ్ణే కావచ్చు, కాని జీవితాంతమూ ఈ అనుభవాన్ని గుర్తుంచు కుంటూ బ్రతుకుతాను— నాకీ చిన్న అవ కాశాన్ని మాత్రం ఈయి.. "

నవ్వుగా నవ్వింది మనోరమ.

తర్వాత చీర కుచ్చెళ్ళను కొంచెంగా పైకి లాక్కొని కుడిపాదాన్ని ముందుకు చాపింది.

చటుక్కున అయ్యప్పకుట్టి కిందకు జారి ఆమె పాదాల్నీ, ఆ అరికాలు బాగాన్నీ ఓ నిమిషం పాటు పదేపదే ముద్దులు పెట్టుకున్నాడు. తర్వాత మరో మాటన్నా మాట్లాడకుండా ఇంటికి తిరిగి వచ్చేసాడు..

ఇది జరిగాక ఓ ఆరునెలలకు హటా త్తుగా ఏదో పెద్దజబ్బు చేసి మనోరమ కన్ను మూసింది.

ఆ తర్వాత రోజుల్లో రాత్రులు పద కొండు దాటాక రోజూ ఓ ఆకారం పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ స్మశానానికి వెళ్ళేది. తెల్లవారుఝామున మూడింటి దాకా ఆ ఆకారం ఓ సమాధివద్ద కూర్చు నేది. ఆ తర్వాత వేళ్ళాడిపోతూ ఆ ఆకారం ఊళ్ళోకి నడిచివచ్చేది.. .

ఆ ఆకారం అయ్యప్పకుట్టి!

ఆ సమాధి మనోరమది!!

వర్షాకాలపు పెద్ద పెద్ద వర్షాలు గానీ, శీతాకాలపు తీవ్రమైన చలులుగానీ అయ్యప్పకుట్టిని పై కార్యక్రమాలనుంచి నిరోధించలేకపోయేవి.

త్వరలోనే వాతావరణపు వాడిదుడు కులు అతని శరీరం మీద దెబ్బతీసాయి. జబ్బు పడ్డాడతను. రేపో మాపో అనే స్థితికి వచ్చింది అతని పరిస్థితి. అట్లాంటి రోజుల్లో ఓ రాత్రి అతను భార్యను దగ్గ రకు పిలాడు.


"నాదో ఆఖరి కోరిక ఉంది తీరు స్తావా?"

"చెప్పండి."

"మనోరమ సమాధి కాళ్ళ వేపున నన్ను సమాధి చెయ్యాలి."

ఏడుస్తూ ఆమె అవతలికి పోయింది.

మర్నాడు అతను ఆమెను మళ్ళీ అడ గాడు.



ఇలా మరో రెండుసార్లు—

"అలాగే చేయిస్తాను..." అన్నదామె ఆఖరికి పళ్ళబిగువున.

"నువ్వంటే కాదు, మనోరమ భర్త తోను ఆమె మామతోను నాకా వాగ్దానాన్ని చేయించాలి"

ఎంత స్వార్థపూరిత అభ్యర్థన!!

ఆమె వెళ్ళి మనోరమ భర్తను ప్రాధేయపడింది.

"బాబూగారూ అది ఎంత అసంబద్ధమైన కోరికో నాకూ తెలుసు— కాని, అవతల చనిపోతున్న ప్రాణం— ఆయన కోర్కెను తీర్చినా తీరవకపోయినా— కోర్కె తీరుతోందన్న తృప్తితోనైనా కనీసం ఆయనను వెళ్ళిపోనిద్దాం—ఒక్కసారంటే ఒక్క—సారి—మీరొచ్చి ఆయనకా వాగ్దానమివ్వండి— నాకు తెలుసు మీకు పరువు ఎంత ముఖ్యమైనదో—ఎవరికీ చెప్పను— ఎవరికీ తెలియకండా ఒక్క—సారి వచ్చి ఆయనకా వాగ్దానం చేయండి."

రెండు గంటలపాటు నడిచింది వాళ్ళ మధ్య సంభాషణ. బతిమాలీబామాలీ, కాళ్ళుపట్టుకునీ కన్నీళ్ళుకార్చీ మొత్తానికెలాగైతేనేం ఆయనను వొప్పించిందామె—

మనోరమ భర్త తన చేతిలో చెయ్యేసి చెప్పుతుంటే అయ్యప్పకుట్టి కళ్ళలో మెరుపులు మెరిసాయి. ఆ తర్వాత ప్రశాంతంగా కళ్ళు మూసుకున్నాడతను. ఆ కళ్ళు మళ్ళీ తెరుచుకోలేదు.

"ఇప్పుడేమంటారు? ప్లెటానిక్ ప్రేమ ఉందంటారా లేదంటారా?" అంతా చెప్పుకొచ్చి అన్నాడు నాయరు.

నా కళ్ళముందు అయ్యప్పకుట్టి భార్య మెదిలింది. పనులతోనూ, పేద

రికంతోనూ, బాధ్యతలతోనూ అలిసిపోయి, వడలిపోయిన నలభైయేళ్ళ స్త్రీ దిగాలుగా చూస్తోంది. భర్త ఆమెనేనాడూ ప్రేమించినట్లు కనపడదు. అట్లాంటి భర్తకోసం అభిమానాన్ని చంపుకుని, అవమానాన్ని దిగమింగుకుని రెండుసార్లు- ఒకసారి మనోరమవద్దకూ మరోసారి మనోరమ భర్తవద్దకూ వెళ్ళి యాచించింది. సాధ్విగా చెప్పుకోవాలా ఆమెను? సెంటిమెంటల్ ఫూల్‌గానా? సహనాన్ని జీర్ణించుకున్న త్యాగమయిగానా??

"నేను నమ్మను, నువ్వీ కథను కల్పించి చెప్పి ఉంటావు."

శ్రీపతి స్వరంతో ఈ లోకంలోకి వచ్చాను.

"లేదు లేదు, నిజంగానే జరిగింది" సిన్సియర్‌గా అన్నాడు నాయరు.

వర్షం ఎప్పుడో తగ్గిపోయినట్లుంది. చల్లటి గాలులు వీస్తున్నాయి.

గుండెల నిండా ఒకసారి గాలి పీల్చి వదిలాను.

"అయ్యప్పకుట్టి ఆఖరి కోర్కెను వాళ్ళు ఫుల్‌ఫిల్ చేసారా?" అడిగాను.

నా ప్రశ్నను ఎవరూ పట్టించుకోలేదు.

"ప్లెటానిక్ ప్రేమ ఉండదన్న నీ స్టేట్‌మెంట్‌ని ఇప్పటికైనా ఉపసంహరించుకుంటావా?" రెట్టించుతున్నట్లుగా అన్నాడు నాయరు శ్రీపతితో.

"లేదు."

"మరి?"

"అసలు అయ్యప్పకుట్టి ప్రేమలోనే ఏదో లొసుగు కనిపిస్తోంది," శ్రీపతి అన్నాడు. "ఆమెపట్ల అతని 'ఆరాధన' అనూ, 'గుడ్డి ప్రేమ' అనూ, 'ప్లెటానిక్ ప్రేమ' అనూ, ఏదైనా గానీ అది ఏమంత సమంజసంగానూ సహేతుకంగానూ కనిపించటంలేదు. మీ అయ్యప్పకుట్టి ఉత్త ఫెకిల్‌మైండ్‌డ్ పర్సన్ అయివుండాలి. మన స్తత్వ శాస్త్రజ్ఞుడెవరినైనా కదిపితే అతడిని ఏ మానసిక రోగగ్రస్తుడి క్రిందో ముద్రవేస్తాడు..."

కొద్దిసేపు ఊరుకొని మళ్ళీ అన్నాడు శ్రీపతి.

"మరో సంగతి ఏమిటంటే మీరు మళయాళీయులు. మీలో ఆడవాళ్ళ డామినేషన్ ఎక్కువ.."

క్షణంపాటు అర్థం కానట్లుగా నాయరు శ్రీపతి కళ్ళల్లోకి గుచ్చి చూశాడు. తర్వాత కుడిచేతిని క్రాపులోనికి పోనిచ్చి పల్చగా ఉన్న తన జుత్తును కొద్దిసేపు అటూ ఇటూ కదిలించాడు.

సడన్‌గా శ్రీపతి నవ్వసాగాడు.

"దుర్మార్గుడా!" నవ్వాను నేను కూడా.